క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

యద్దనపూడి: వాసవిక్లబ్ యద్దనపూడి వారి ఆధ్వర్యంలో మండలంలోని యనమల గ్రామంలో డాన్ టూ డెస్క్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. అలాగే గ్రామంలో మూడు సిమెంట్ బల్లలను సచివాలయానికి అందజేశారు. 50 మంది షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోలిశెట్టి హనుమంతురావు,ప్రెసిడెంట్ పోత్తూరి వెంకటరాంబాబు, ట్రెజరర్ నరసింహరావు, గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు .

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఈఓపీఆర్డీ కృష్ణ

కారంచేడు: గ్రామాల్లోని ప్రజలు తమ ఇంటి పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతను కూడా పాటించాలని ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ ఎల్‌కే కృష్ణ అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రం కారంచేడుతో పాటు, దగ్గుబాడు–ఇంకొల్లు, పర్చూరు–దగ్గుబాడు, కారంచేడు–చీరాల గ్రామాల మధ్యన రహదారుల వెంట ఉన్న చెత్తా,చెదారాలను ఆయన దగ్గరుండి శుభ్రం చేయించారు. ఆదివారం అయినప్పటికీ ఆయన కార్మికులను వెంటబెట్టుకొని చెత్తను తొలగించి ట్రాక్టర్‌లో చెత్త సంపద కేంద్రాలకు తరలించారు. ఆయన వెంట ఆయా గ్రామాల కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు.



పంచాయతీ అనుమతి లేకుండా కొనసాగుతున్న ఓ ప్రైవేట్ పాఠశాల

ఫ్రైవేటుకు రైట్ రైట్.. సర్కారుకు నైనై!

- ప్రైవేటు స్కూళ్లకు అడ్డగోలుగా అనుమతులిస్తున్న అధికారులు
- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి పెట్టని ప్రభుత్వం
- ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన హాజరు
- కనీస వసతులు కూడా లేని ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు

చినగంజాం:

కూటమి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలను నిర్వీర్యం చేసి సర్వనాశనం చేసిందన్న విషయం అందరికీ తెలిసిందే. ఈ ప్రభుత్వంలో వీధి కొక ప్రైవేటు బడి.. సందుసందుకో బెల్టుషాపులతో నిత్యం కళకళలాడుతోంది. ప్రభుత్వ పాఠశాలలంటే గిట్టని కూటమి సీఎం చంద్రబాబునాయుడు ఎప్పుడూ ప్రైవేటు, కార్పొరేట్ సేవలో తరిస్తుంటాడు. పేద, మధ్య తరగతి కుటుంబాలు అంతటి ఫీజులు కట్టుకోలేక ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తుంటారు. అలాంటి పాఠశాలలను నిర్వీర్యం చేస్తే దిక్కులేక ప్రైవేటు పాఠశాలలకు వస్తారన్న ఉద్దేశంతో ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల ఏర్పాటుకు విచ్చలవిడిగా అనుమతులు మంజూరు చేస్తుండటంతో మండల వ్యాప్తంగా పలు ప్రైవేటు పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఏర్పాటుతో ఆధునిక సౌకర్యాలతో నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అవుతున్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థికి అవసరమైన యూనిఫాం, పుస్తకాలు, షూస్, బెల్ట్, టై తదితర వస్తువులను సైతం పాఠశాలల్లోనే అమ్ముతూ పూర్తిగా వ్యాపార సంస్థలుగా మారుతున్నాయి. తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలు చూపించే ఆకర్షణలకులోనై అధిక శాతం ప్రైవేటు పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తున్నారు. మెరిట్ మార్కులు సాధించాలంటే తమకు ప్రైవేటు పాఠశాలలే సమంజసం అంటూ చేర్పిస్తున్నారు.

చినగంజాం మండలంలో ప్రభుత్వ పాఠశాలల బలహీనం..

మండలంలో ప్రైవేట్ పాఠశాలలు ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయి. గతంలో 4 వేలకు పైగా ఉన్న విద్యార్థుల హాజరు ప్రైవేట్ పాఠశాలల రాకతో పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. మండలంలో మొత్తం 38 పాఠశాలలుండగా వాటిలో 29 ప్రాథమిక పాఠశాలలు, 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 1 యూపీ స్కూల్, కేజీబీవీ 1 ఉన్నాయి. వీటితో పాటు మండలంలో ఐదుకు పైగా ప్రైవేట్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. 4 వేలకు పైగా ఉండాల్సిన విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం మండలంలోని అన్ని పాఠశాలల్లో సుమారు 3600 మంది విద్యార్థులు కొనసాగుతున్నారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలతో కలిపి ప్రైవేట్ పాఠశాలల్లో 1200 మందికి పైగా విద్యార్థులు కొనసాగుతున్నారు.



భద్రత లేకుండా కొనసాగుతున్న తరగతి గదులు

ప్రభుత్వ నిబంధనలు గాలికి..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాల ఏర్పాటుకు ముందు పంచాయతీ లేక మున్సిపాలిటీ అనుమతి తీసుకోవాలి. అగ్నిమాపక సిబ్బంది నుంచి ఫైర్ సర్టిఫికెట్, పాఠశాల భవన నిర్మాణానికి సంబంధించి సంబంధిత శాఖాధికారుల నుంచి ధ్రువీకరణ వంటి ప్రాథమిక అనుమతులు కచ్చితంగా ఉండి తీరాలి.

కాని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు నిబంధనలు లేకపోయినా రాజకీయ నాయకుల సిఫారసులు, ఇతర పలుకుబడి ఉపయోగించి అనుమతులు పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెన్యువల్ సమయాలలో సైతం కేవలం సర్టిఫికెట్‌లు చూపి అనుమతులు కొనసాగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఈ విషయమై మండల విద్యాశాఖాధికారి బొల్లిముంత అజయ్ బాబును వివరణ కోరగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో ఇంటింటికి తిరిగి బడిబయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అదే విధంగా మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో వసతులు సక్రమంగా లేని పాఠశాలలను, అనుమతులు లేని పాఠశాలలను గుర్తించి చర్యలు తీసుకుంటాం.

కనీస వసతుల కల్పనలో ఫెయిల్..

ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి వేలకు వేలు ఫీజులు దండుకునే విషయంలో చూపినంత శ్రద్ధ మౌళిక వసతుల కల్పనలో చూపించడ లేదు. విద్యార్థులకు ఆట పాటల కోసం చక్కటి ఆట స్థలం, మరుగుదొడ్ల సౌకర్యం, తాగునీటి సౌకర్యం, గాలి వెలుతురు చక్కగా అందేలా విశాలమైన తరగతి గదులు, విద్యార్థులు కూర్చొనేందుకు అవసరమైన బల్లలు కలిపించడంలో పూర్తిగా విఫలమవుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థుల భద్రతపై ప్రాధాన్యత లేకుండా చేస్తున్నాయని ఆరోపణలు సైతం బహిరంగంగా వినిపిస్తున్నాయి. అపార్టుమెంట్‌లు, ఇరుకు గదుల్లో తరగతులను నిర్వహిస్తూ విద్యార్థుల భద్రత గాలిలో దీపంలాగా ఉంచుతున్నారనేది గమనార్హం.

భవిష్యత్‌కు గ్యారెంటీ.. బాబు మార్కు గారడీ



చంద్రబాబు ఇంటింటికి పంపిణీ చేయించిన ష్యూరిటీ బాండ్



మాట్లాడుతున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి

- చంద్రబాబుకు జాబ్ ఇస్తే ఆయన యువతకు చేయిచ్చారు
- ఏడాదైనా ఉద్యోగాలు లేవు.. నిరుద్యోగ భృతి ఊసేలేదు
- నేటి యువత పోరును విజయవంతం చేద్దాం
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి పిలుపు

మార్టూరు: 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ' అంటూ ఎన్నికలకు ముందు చంద్రబాబు అండ్ కో చేసిన గారడీని నమ్మి ఓటేసిన ప్రజలు, యువతను నిలువునా ముంచారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి ధ్వజమెత్తారు. ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రిని నేటి 'యువత పోరు'లో నిలదీద్దామని పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం మార్టూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బత్తుల మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామ/వార్డు సచివాలయాలు, ఆరోగ్య విభాగం, ఇతర ప్రభుత్వ శాఖల్లో కొత్తగా 2.50 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో కొత్త ఉద్యోగాల సంగతి దేవుడెరుగు ఉన్నవారిని సైతం ఊడబీకి పొట్టకొడుతున్నారని నిప్పులు చెరిగారు. ఏటా ఐదు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, అప్పటి వరకు రాష్ట్రంలోని ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేల చొప్పున ఏడాదికి రూ.36 వేలు అందిస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆడబిడ్డ నిధి పేరుతో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు, అన్నదాతకు పెట్టుబడి నిధి కింద ఏటా రూ.20 వేలు ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని నిలదీశారు. 50 ఏళ్లు నిండిన ప్రతి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు నెలకు రూ.4 వేల చొప్పున పెన్షన్ ఇస్తామన్న హామీని సీఎం చంద్రబాబు, కూటమి నాయకులు మరిచిపోయి ఉండవచ్చు కానీ ఆయా వర్గాల ప్రజలు మరువలేదన్నారు.

తల్లికి వందనం లోపభూయిష్టం

సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన తల్లికి వందనం పథకాన్ని ఏడాది ఆలస్యంగా, అది కూడా లోపభూయిష్టంగా అమలు చేశారని బత్తుల ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హుల పేర్లు జాబితాలో ఎగరగొట్టి మోసం చేశారని మండిపడ్డారు. గత ఏడాది కాలంగా రైతులు పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతున్నారని, పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇచ్చి ఉంటే రైతులకు కాస్తయినా ఉపశమనం కలిగి ఉండేదని అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వంతో సంక్షేమ ఫలాలు అందిస్తామన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మౌనం పాటించడం వెనుక మర్మమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలకు కట్టుబడటమే కాక ఇవ్వని హామీలను సైతం నెరవేర్చారు కాబట్టే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను గుర్తు చేసుకుని ప్రజలు నీరాజనం పడుతున్నారన్నారు. అనంతరం టీడీపీ బూత్ కమిటీ అధ్యక్షుల ద్వారా గత ఎన్నికల వేళ చంద్రబాబు ఇంటింటికీ పంపిణీ చేయించిన ష్యూరిటీ బాండ్లను ప్రదర్శించారు.

కన్నుల పండువగా పోలేరమ్మ కొలుపులు



కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి



కారంచేడు: ఊరేగింపులో అమ్మవారి చిత్రపటం

కారంచేడు: గ్రామ దేవత, అన్నదాతల ఇలవేల్పు పోలేరమ్మ తల్లి కొలుపులను ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామస్తులందరూ సుఖ సంతోషాలతోను, ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో ఉండాలని ప్రజలు కొలుపులు చేయడం ఆనవాయితీ. ప్రతి ఏడాది సాగుకు ముందు గ్రామంలో ప్రాంతాల వారిగా ఈ కొలుపులు చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. దీనిలో భాగంగా ఆదివారం గ్రామంలోని బందెలదొడ్డి బజారుకు చెందిన అన్నదాతలు, యువకులు, చిన్నారులు, మహిళలు పెద్ద ఎత్తున పోలేరమ్మకు పూజలు చేశారు. రాత్రికి అమ్మవారి చిత్రపటం ఊరేగింపులో యువకులతో పాటు చిన్నారులు వీరతాళ్లతో నృత్యాలు చేశారు. విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి.

కారంచేడు గ్రామ దేవతగా విరాజిల్లుతున్న గంగమ్మతల్లికి గ్రామ ఆడపడుచులు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలమ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



యువత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న మార్టూరు వైఎస్సార్ సీపీ నాయకులు

అద్దంకి: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం యువతపోరు పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి యువత పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక మునుపు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత మోసం చేసిందన్నారు. దానిపై యువత పోరు కార్యక్రమంగా నిర్వహించ తలపెట్టినట్లు వెల్లడించారు. నిరుద్యోగ యువత ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర, నియోజకవర్గ, మండలాల హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

యువత పోరును విజయవంతం చేయండి

పర్చూరు (చినగంజాం): వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ కూటమి ప్రభుత్వంపై నిరసన గళం వినిపిస్తూ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి తక్షణమే అందజేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 23 వతేదీ సోమవారం 11 గంటలకు యువజన విభాగం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామ, నియోజకవర్గానికి సంబంధించిన యువజన విభాగం అధ్యక్షులు, అనుబంధ విభాగ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మార్టూరు: నేడు బాపట్లలో నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని మార్టూరు మండల కన్వీనర్ జంపని వీరయ్య చౌదరి పిలుపునిచ్చారు. మార్టూరులో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఉప్పలపాటి అనిల్ చౌదరి, అడకా గంగయ్య, పుట్ట వీరయ్య చౌదరి, ఎస్టీ సెల్ నాయకులు చిన్న నాయక్, తమ్ములూరి సురేష్, రామ్ గోపాల్ వర్మ, మైలా చిన్న నాగేశ్వరరావు, జైపాల్, సింగయ్య, మోషే,,అల్లాబక్షు, కిషోర్, హనుమయ్య వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



గాదె మధుసూదన్‌రెడ్డి

రాజ్యాంగంతోనే సామాన్యులకు న్యాయం

చీరాల అర్బన్: రాజ్యాంగం అనేక హక్కులు, అవకాశాలు, అధికారాలను ప్రజలకు కల్పించి బాధ్యతలను నిర్దేశిస్తుందని న్యాయవాది, రాజనీతి శాస్త్ర విశ్రాంత అధ్యాపకుడు ఎన్ పౌలస్ అన్నారు. సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఆదివారం భారత రాజ్యాంగ ప్రాథమిక హక్కుల అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. సభకు సంస్థ ఉపాధ్యక్షుడు ఏ నాగవీరభద్రాచారి అధ్యక్షత వహిస్తూ రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సభలో కట్టా రాజ్ వినయ్‌కుమార్, కార్యదర్శి ఏ రామారావు, మద్ది బదరీ నారాయణ, ఎం కోటేశ్వరరావు, మణిశర్మ పాల్గొన్నారు. సభ అనంతరం ముఖ్య అతిథి పౌలస్‌ను సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

తీరంలో సండే సందడి



వాడరేవు తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

చీరాల టౌన్: మండల పరిధిలోని వాడరేవు సముద్ర తీరం ఆదివారం పర్యాటకులతో కోలాహలంగా మారింది. వివిధ గ్రామాల ప్రజలు తమ కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు తీరానికి చేరుకున్నారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ సముద్రంలో స్నానమాచరించి ఆనందోత్సాహాలతో సందడి చేశారు. చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలతో పాటుగా పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలతో పాటుగా తెలంగాణా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెదిన ప్రజలు తమ కుటుంబ సభ్యులతో వాడరేవు చేరుకుని స్నానాలు ఆచరించి తీరంలో సరదాగా గడిపారు. దీంతో వాడరేవులో కోలాహలం నెలకొంది.

వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చిమటా దివ్య

వేటపాలెం: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో వాసవీ క్లబ్, వనితా వైష్ణవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. క్లబ్ డాన్ టు డెస్క్ కార్యక్రమాల్లో భాగంగా ఉచిత వైద్యశిబిరంతో పాటు విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, మానసిక దివ్యాంగులకు కిట్లు, సిమెంట్ బల్లలు, మజ్జిగ పంపిణీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా ఉచిత షుగర్ వైద్య శిబిరం నిర్వహించారు. చీరాల కామక్షి కేర్ హాస్పిటల్ వారి సహకారంతో డాక్టర్ చిమటా దివ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. దాదాపు 60 మంది షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్లబ్ గవర్నర్ అన్నం సాయి సునీత, కోఆర్డినేటర్ చందా వెంకట స్వామి, కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ తాడివలస దేవరాజు, చక్క ఇందుమతి, తాత సుజాత, ప్రెసిడెంట్ శ్రీరామ్ బాబ్జీ, సతులూరి వెంకట రమేష్, మువ్వల కోటేశ్వరరావు, వనితా వైష్ణవి పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బొలేరో



గుడిపాడు సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బొలెరో



గాయాల పాలైన సన్నీ

బల్లికురవ: కోళ్ల వ్యర్థాలు తీసుకువచ్చేందుకు బొలేరో వాహనంలో వెళ్తూ ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టటంతో డ్రైవర్, సహాయకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈఘటన ఆదివారం సాయంత్రం మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ రహదారిలోని మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామ సమీపంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం అద్దంకికి చెందిన షేక్ సన్నీ, పీ.గోపి బొలెరో వాహనంతో నరసరావుపేట వెళ్తున్నారు. నార్కెట్‌పల్లి వైపు వెళ్తున్న లారీ రోడ్డు మార్జిన్‌లో ఆగింది. ఈక్రమంలో బొలేరో లారీని ఢీకొట్టటంతో డ్రైవర్ సన్నీ, సహాయకుడు గోపి ఇరువురికి తలకు కాళ్లకు తీవ్రగాయాలపాలయ్యారు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. బల్లికురవ నుంచి వచ్చిన 108 వాహన ఈఎంటీ నాగరాజు, పైలేట్ బాషా ప్రాథమిక చికిత్స చేసి ఉన్నత చికిత్సకై అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఘనంగా శ్రీరామ మందిర వార్షికోత్సవం

చీరాల అర్బన్: స్థానిక వీరరాఘవ వేటలోని శ్రీరామ మందిరంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 108 మంది విద్యార్థులచే సరస్వతి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. సరస్వతి అమ్మవారిని ప్రత్యేక అలంకారాలతో అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పూజా కార్యక్రమాలనంతరం భక్తులకు, విద్యార్థులకు ప్రసాద వినియోగం చేశారు.

వైభవంగా అంకమ్మతల్లి వార్షిక తిరునాళ్లు

బల్లికురవ: మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామ సమీపంలో పొలాల్లో వేంచేసివున్న అంకమ్మ తల్లి వార్షిక తిరునాళ్లు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంతాన్ని 12వ శతాబ్దంలో రాజులు పరిపాలించారని అప్పట్లో పెద జంగాలపల్లిగా పిలవబడేదని చరిత్రలు చెప్తున్నాయి. కొమ్మినేనివారిపాలెం గ్రామానికి సమీపంలో పొలాల్లో వెలిసిన అంకమ్మతల్లికి గ్రామస్తులు ఆలయాన్ని నిర్మించి రహదారి వసతి కల్పించారు. ప్రతి ఏడాది తిరునాళ్ల వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచే భక్తులు ఆలయ సన్నిధికి చేరి పొంగళ్లు పెట్టి అమ్మవారికి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ చేపట్టారు. రాత్రికి కోలాట ప్రదర్శన, భారీ ఎలక్ట్రిక్ ప్రభతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం



అవార్డులు అందజేస్తున్న రోటరీ క్లబ్ మాజీ గవర్నర్

చీరాల అర్బన్: వివిధ రంగాల్లో నిజాయితీగా నిబద్ధతతో పనిచేసి ప్రజలకు సేవలందించిన వ్యక్తులను చీరాల రోటరీ క్లబ్ ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డులు ప్రదానం చేసింది. శనివారం రాత్రి రోటరీ కమ్యూనిటీ హాలులో చీరాల రోటరీ క్లబ్ ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024–25 ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మాజీ డిస్ట్రిక్ గవర్నర్ తల్లా రాజశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ తేళ్ల రమేష్‌చంద్ర చేతుల మీదుగా వడలి రాధాకృష్ణ, నర్విశెట్టి సుబ్బరామయ్య, వితేకల పవన్‌కుమార్,పీతా వెంకట సుబ్బారావు, పోటేటి దయాబాబు, కందుల శివకుమారిలను శాలువాతో సత్కరించి జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ బాల వెంకటేశ్వరరావు,నక్కల సురేష్ బాబు, కరణం శ్రీనివాసబాబు, గుర్రం రాఘవరావు, డాక్టర్ బాబురావు సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం ప్రారంభం

పర్చూరు (చినగంజాం): క్రీడాకారులు మానసికంగా, శారీరకంగా ధృఢంగా ఉంటారని స్వాప్ చైర్మన్ రవి నాయుడు అన్నారు. ఆదివారం పర్చూరులో రూ.2 కోట్ల నిధులతో నిర్మించిన ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో క్రీడా వికాస కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలోని చినగంజాం, మార్టూరు, ఇంకొల్లు, యద్దనపూడి మండలాల్లో ఎక్కువ మంది విద్యార్థులు క్రీడలలో రాణిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.